క్లుప్తంగా

వైభవంగా గ్రామాల్లో నేలతల్లికి నమస్కారం



నా భూమి నాదేశం శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ కృష్ణ

సీతానగరం: ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం నేతృత్వంలో నేలతల్లికి వందనం..అమర వీరులకు జోహార్లు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం విద్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో చెరువుల అభివృద్ధి, పారదర్శకంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కమిటీ కన్వీనర్లు, కార్యదర్శి మురళి, గ్రామవలంటీర్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

మక్కువ: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం మెట్టు పంటలకు ఉపయోగకరమైని రైతులు చెబుతున్నారు.

రైతులకు దుస్తుల పంపిణీ

సాలూరు: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూన్ స్వచ్ఛంద సంస్థ మండలంలోని ముంగివానివలస రైతులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. దుస్తులు, దుప్పట్లు, ఇతర వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ ఏఈఓ నాగేశ్వరరావు, సీఈఓ భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల పంపిణీ



విద్యార్థులకు పరుపులు అందజేస్తున్న సిబ్బంది

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకులం బాలురుకు సోమవారం పరుపులు పంపిణీ చేశారు. పరుపులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన మంత్రి రాజన్నదొర సుమారు 860 పరుపులు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది గణపతి, తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ ఏకగ్రీవం



వార్డు మెంబర్ ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి ఆర్.పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట పంచాయతీ 6వ వార్డు మెంబర్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఆర్.పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ వార్డు మెంబర్ అకాల మృతి కారణంగా ఎన్నిక అనివార్యమైందన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తరువాత ఒకే నామినేషన్ దాఖలు కావడంతో 6వ వార్డు మెంబర్‌గా బి.వరప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అందజేసినట్లు చెప్పారు. అలాగే జోగింపేటలో ఎస్టీ కుటుంబాలు లేని కారణంగా 1వవార్డు, 7వ వార్డులకు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఎన్నికలు జరగడంలేదని ఎన్నికల అధికారి కె.కుమారవర్మ తెలియజేశారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ఈఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. జూలై 10 నుంచి ఈనెల 13 వరకు 32 రోజులకు గాను హుండీల ద్వారా రూ.3,63,821లు ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణ అధికారి కె.వెంకటరమణ, ఉపప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న మహిళా పక్షపాతి



రోడ్‌షోకు హాజరైన అభిమానులు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత పక్కనే ఎమ్మెల్యే జోగారావు

- పెరిగిన మహిళల గౌరవం
- సీఎం పాలనలో తగ్గిన పేదరికం
- హోం మంత్రి తానేటి వనిత

పార్వతీపురం టౌన్: దివంగత మహానేత, వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే అదే పేదలకోసం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నారన్నారని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యను కూడా తీరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని గుర్తించి గౌరవిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా పరిపాలన అందిస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ బలం జగనన్న సైన్యమే

2019లో 151 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకోవడానికి గల కారణం జగనన్న సైన్యమే. జగనన్న సంక్షేమ పాలన పొందుతున్నామంటే మనమంతా జగనన్నకు బలంగా ఉండడమే కారణమన్నారు.

మహిళా పక్షపాతిగా పెంచిన గౌరవం

జగనన్న మహిళా పక్షపాతిగా మహిళల గౌరవాన్ని పెంచారన్నారు. నాలుగు సంవత్సరాల పరిపాలన కాలంలో రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకాన్ని అమలు చేసినా అన్ని పథకాలు మహిళల పేరిట అందజేశారని చెప్పారు. ఇటువంటి మహిళా సంక్షేమ పాలన భారత దేశంలో ఎక్కడా లేదన్నారు. మహిళలంతా సాధికారత సాధించాలని మహిళల పేరిట పథకాలు అందజేస్తూ ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నారన్నారు. మహిళలంతా జగనన్నకు ఆత్మబంధువుగా నిలవాలని కోరారు.

జగనన్న పాలనలో పేదరికం పరారీ

చంద్రబాబునాయుడు పరిపాలనలో పేదరికం 12శాతం ఉంటే జగనన్న పాలనలో 6శాతానికి తగ్గిందన్నారు. జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి పేదవాడు పేదరికం నుంచి బయటకు వస్తున్నాడన్నారు. ఇవన్నీ చూడలేక కొంతమంది నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా పేదలను సోమరిపోతులను చేస్తున్నారని ఆరోపిస్తున్నారన్నారు. అందరి కుటుంబాల్లో పేదరికాన్ని దూరం చేయడం కోసం, పేదింటి పిల్లలను విద్యావంతులను చేయడం కోసం ప్రతి కుటుంబంలో విద్యాదీపాన్ని వెలిగించిన ముఖ్యమంత్రి కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు.

జోగారావును భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మీరంతా కలిసికట్టుగా ఉండిఐక్యతగా, బాధ్యతగా పార్వతీపురం నియోజకవర్గం నుంచి అలజంగి జోగారావును అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని అందరినీ కోరుతున్నానన్నారు.

జనసేనకు జెండా, అజెండా లేదు

జనసేన పార్టీకి జెండా, అజెండా కూడా లేదన్నారు. కేంద్రంతో చెప్పి ఆటాడుకునేంత దమ్ము ఆ పార్టీ అధ్యక్షుడికి ఉంటే కేంద్రంతో చెప్పి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో దళారీ వ్యవస్థ, మధ్యవర్తులు, లంచం లేకుండా వ్యవస్థను పూర్తిగా ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారులకు అందించే విధానాన్ని తీసుకువచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్‌ఎంపీపీలు బంకురు రవికుమార్ సిద్దా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరమేష్, స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- మంత్రి రాజన్నదొర



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాచిపెంట: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కోటికిపెంట పంచాయతీ గోగాడవలస, చండివలసలలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమస్యలు తెలియజేయాలని కోరగా.. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మదల సత్యవతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డోల బాబ్జీ, పాచిపెంట వీరంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంట నమోదు

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రంగునాయుడు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

మక్కువ: పంట నమోదు, ఎరువుల పంపిణీ సకాలంలో సక్రమంగా జరిపించాలని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మావుడి రంగునాయుడు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన ఎరువులు సచివాలయాలు ద్వారా సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకేల వద్ద ఇన్‌చార్జ్‌లు అందుబాటులో ఉండి పంట నమోదు, ఎరువుల పంపిణీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెంట సంజీవునాయుడు, వేమూరి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి జగనన్న తోడు

- చిరువ్యాపారాలకు వడ్డీలేని రుణాలు
- కొత్తవారికి రూ.10 వేలు
- పాత వారికి రూ. 20 వేలు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు



అంటిపేటలో చిరువ్యాపారి మహిళ షాపువద్ద బయోమెట్రిక్ చేస్తున్న వీఓఏ

సీతానగరం: మండలంలో వెలుగు ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న జగనన్న తోడు పథకంలో భాగంగా 7వ విడతగా మహిళాసంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా చిరువ్యాపారస్తులు వడ్డీలేనిరుణాలు పొందడానికి గ్రామాల్లో వీఓఏలు లబ్ధిదారుల ఎంపికకు బయోమెట్రిక్ వేస్తున్న కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించిన అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న తోడు పథకం ద్వారా 7వ విడతగా కొత్తగా చిరు వ్యాపారస్తులకు బ్యాంక్‌ల ద్వారా వడ్డీలేని రుణంగా రూ.10వేలు వంతున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గతంలో రుణాలు తీసుకుని సక్రమంగా రెన్యువల్ చేసుకున్న వారికి రూ.20 వేలు వంతున వడ్డీలేని రుణాలు బ్యాంక్‌ల ద్వారా చెల్లించడానికి వీఓఏలు పొదుపు సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి బయో మెట్రిక్ చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో వీఓఏలు, సీసీల పర్యవేక్షణలో 453 మంది చిరు వ్యాపారస్తులైన సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేశామన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే కాలుష్యనివారణ



అప్పయ్య చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న రాష్ట్ర పీఆర్ సహాయ కమిషనర్ అశోక్‌కుమార్

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ సరోవర్ పథకంలో భాగంగా గ్రామాల్లో ప్రజలు చేపడుతున్న చెరువుల అభివృద్ధితో పాటు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోనే పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించవచ్చని, వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో మంచినీరు కోనేరుగట్టుపై సోమవారం రాష్ట్ర అదనపు కమిషనర్, అశోక్‌కుమార్‌తో పాటు డ్వామా జిల్లా పీడీ కె.రామచంద్రరావు కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన నా దేశం- నామట్టి-వీరులకు వందనం కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేసి సమాజానికి మంచి మెసేజ్ ఇవ్వాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు మంచినీరు కోనేరును శుద్ధి చేసుకోవాలని, వీధుల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, చెరువుగట్లపై మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదకర మైన వాతావరణం కలిగే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె రామచంద్రరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ భాను, జేఈ కృష్ణ, సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసీ బి.కుసుమ, సచివాలయం కన్వీనరు బి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఎస్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఎస్.ఆనందరావు, ఎస్.గౌరునాయుడు, ఉపాధిహామీ పథకం మండల టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పన్నుల వసూలు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి గ్రామస్థాయిలో పన్నుల వసూలు ప్రక్రియ డిజిటల్ విధానంలో పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని బెజ్జి సచివాలయంలో కార్యదర్శులతో సోమవారం సమావేశం చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనలతో క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు వసూలు చేయాలన్నారు. నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించటం, ప్రజల్లో చైతన్యం తీసుకురావటంతో ఖజానాకు చేరాల్సిన సొమ్ము నేరుగా ప్రభుత్వ అకౌంట్‌కు చేరుతుందన్నారు. ఈ విధానంలో ఎటువంటి అవకతవకలకు అస్కా రం ఉండదన్నారు. సిబ్బంది కచ్చితంగా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలన్నారు.

గుమ్మ సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామ సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆర్‌ఓ పి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల గుమ్మ సర్పంచ్ మృతితో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా.. ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు చెప్పారు. సోమవారం ఒక అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ప్రస్తుతం ఆరిక గోపాలరావు, కొండగొర్రి వెంకటరావు, బిమ్మక భానుప్రసాద్, తోట పట్టయ్య బరిలో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బియ్యాలవలస పంచాయతీలో ఖాళీ అయిన వార్డు మెంబర్ స్థానానికి టి.భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌ఓ ప్రకటించారు.

పనుకువలస సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస సర్పంచ్ కోట ముకుందనాయుడు మృతిచెందడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏకమై ముకుందనాయుడు కుటుంబ సభ్యురాలైన కోట మంజుభార్గవిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. సర్పంచ్ స్థానానికి మంజుభార్గవి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆర్‌ఓ ప్రవల్లిక, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైె నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. అలాగే మండలలోని అన్నవరం పంచాయతీ 6వ వార్డు(ఎస్సీ ఆల్) స్థానంకు రాగోలు చంద్రశేఖర్, వీపీ రాజుపేట పంచాయతీ ఒకటవ వార్డు (బీసీ జనరల్) స్థానానికి శాసపు లక్ష్మీనారాయణ, ఇదే పంచాయతీలో 7వ వార్డు (ఎస్సీ జనరల్) స్థానంకు బొమ్మలాట శాంతమ్మ మాత్రమే నామినేషన్లు వేయటంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ స్టేజ్-1 అధికారులు డొంక త్రినాథులు, కె.సోంబాబు ప్రకటించారు.

ఎఫ్ఏ-1 ప్రోగ్రస్ కార్డుల అందజేత

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాల విద్యార్థినులకు సోమవారం ఎఫ్ఏ-1 ప్రోగ్రస్ కార్డులను అందజేశారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థినుల తల్లిదండ్రులకు మార్కుల జాబితాలను అందించి, తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలియజేశారు. బైజూస్, టోఫెల్ వంటి టెక్నాలజీతో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేపడుతున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతంపేట: జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎస్.గుడ్డు (52) అనే వ్యక్తి సోమవారం మృతిచెందారు. భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఆయన గత కొద్దిరోజులుగా జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతున్నాడు. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గడంతో తీవ్ర అవస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

కుమ్మరిగుంటలో వైద్యశిబిరం

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనారోగ్యం బారిన పడిన వారికి రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామని తెలిపారు. గ్రామంలోని పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది టి.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం

పాలకొండ రూరల్: భాసూరు సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో తోటపల్లి ఎడమ కాలువలో సోమవారం పూడిక తీతలు చేపట్టారు. భాసూరుతో పాటు చింతాడ, వాటపాగు, పద్మాపురం గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమవంతు సహకారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్త, గుర్రపుడెక్క, తూడిబడ్లు పేరుకుయి నీటి సరఫరాకు ఆటంకంగా మారాయి. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూడికలను తొలగించారు.